# రెండో విడత పోలింగ్‌కు బెంగాల్ సిద్ధం



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌కు బంగాల్ సిద్ధమైంది. బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. 294 నియోజకవర్గాలు ఉన్న బంగాల్‌లో ఏప్రిల్ 23న మొదటివిడతగా 152 స్థానాలకు పోలింగ్ జరిగింది. బుధవారం కోల్?కతా, హావ్?డా, హుగ్లీ, ఉత్తర, దక్షిణ 24 పరగణా వంటి కీలక జిల్లాల్లోని 142 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఓటింగ్ కోసం 41 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. ప్రతీ పోలింగ్ కేంద్రం నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష నిఘా పెట్టనున్నట్లు ఈసీ తెలిపింది. అటు మొత్తంగా 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించింది.రెండో విడతలో మొత్తం 1,448 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా 3.21 కోట్ల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని తేల్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందులో 1,64,35,627 మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది ట్రాన్స్?జెండర్లు ఉన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హింస జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఈసీ భద్రత కట్టుదిట్టం చేసింది. మొత్తం 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించింది. అత్యధికంగా కోల్‌కతాలో 273 కంపెనీల బలగాలను మోహరించింది. బాంబు దాడులు జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎన్ఐఏ బృందాలను కూడా ఈసీ రంగంలోకి దించింది. 142 మంది జనరల్ అబ్జర్వర్లు, 95 మంది పోలీస్ అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో నిఘా పెట్టారు. మొదటి విడతలో రికార్డు స్థాయిలో 92శాతం ఓటింగ్ నమోదైంది. రెండో విడతలోనూ భారీగా నమోదయ్యే అవకాశం ఉంది. మే 4న బంగాల్‌తో పాటు అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు. మరోవైపు సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది ఎన్నికల సంఘం. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఎలాంటి 4అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. ఇటీవల దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తైంది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా, బీజేపీ 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అటు 2021లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 77 సీట్లు రాగా, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 213 సీట్లతో భారీ విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

## లిఫ్ట్ కింద తల ఇరుక్కొని మహిళ మృతి



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
సర్జికల్ యంత్రాలు తీసుకెళ్లే లిఫ్ట్ కింద తల ఇరుక్కోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగిని మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని నాసిక్‌లో చోటుచేసుకుంది. నాసిక్‌లోని డాక్టర్ వసంతరావు పవార్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని సర్జరీ విభాగంలో జ్యోతి శివాజీ (50) అనే మహిళ ఒప్పంద కార్మికురాలిగా పని చేస్తున్నారు. సోమవారం శస్త్రచికిత్స పరికరాలను రవాణా చేయడానికి ఉపయోగించే ఫ్రైట్ లిఫ్ట్ ఉన్న ప్రదేశానికి ఆమె వెళ్లారు. లిఫ్ట్ ఎక్కడ ఉందో చూడడానికి అది వెళ్లే మార్గంలో కిందకు వంగి చూస్తుండగా.. అదే సమయంలో పై నుంచి లిఫ్ట్ రావడంతో ఆమె తల లిఫ్ట్ కింద ఇరుక్కుపోయింది.దీంతో అక్కడే ఉన్న ఉద్యోగులు అప్రమత్తమై.. ఆమె తలను బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ ఘటన అంతా అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. అనంతరం నిపుణుల సాయంతో లిఫ్ట్‌ను పైకి తీసి.. ఆమెను ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. లిఫ్ట్ మెడపై పడడంతో నరాలు, వెన్నెముక తీవ్రంగా దెబ్బతిని ఆమె మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పతనం అంచున ఉన్నట్లు ఇరాన్ చెప్పింది: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌కు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పతనం అంచున ఉన్నట్లు ఇరాన్ తమకు తెలియజేసిందన్నారు. వీలైనంత త్వరగా హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని ముగించాలని తమను కోరినట్లు 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్ తన నాయకత్వాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నాల్లో ఉందన్నారు. అమెరికాతో చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను వాళ్లు పరిష్కరించుకోవాలని ట్రంప్ సూచించారు.అయితే, ఇరాన్ నుంచి ఈ విషయాన్ని ఎవరు చెప్పారనే వివరాలు ట్రంప్ వెల్లడించలేదు. సంభాషణ నేరుగా జరిగిందా? లేక మధ్యవర్తి ద్వారా ఈ విషయాన్ని తెలియజేశారా? అనే దానిపై స్పష్టత లేదు. దీనిపై వైట్‌హౌస్ కూడా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

# డిజిటల్ అరెస్టులపై 'బయోమెట్రిక్' అస్త్రం!


విశ్వంభర, నేషనల్ బ్యూరో:
కొంతకాలంగా దేశంలో 'డిజిటల్ అరెస్ట్' మోసాలు పెను ముప్పుగా మారుతున్నాయి. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ తరహా మోసాల బారిన పడుతుండటంపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను అరికట్టేలా కేంద్రం పలు నిబంధనలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన నివేదికను తాజాగా అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. ఈ మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత వంటి చర్యలను కేంద్రం అందులో పేర్కొంది.పలు రంగాల నిపుణులు, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపుల అనంతరం కేంద్రం ఈ నివేదికను రూపొందించింది. దీన్ని పరిశీలించిన అనంతరం ప్రతిపాదనల అమలు కోసం టెలికమ్యూనికేషన్ విభాగం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఈ నివేదికను న్యాయస్థానానికి సమర్పించింది.

### కేంద్రం సిఫార్సులు ఇవే..

- సిమ్ కార్డు జారీ చేసే సమయంలో టెలీకమ్యూనికేషన్ (యూజర్ ఐడెంటిఫికేషన్) రూల్స్, బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వ్యవస్థను కఠినంగా అమలు చేయాలి. టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి.
- సిమ్ యాక్టివేషన్ చేసే పాయింట్ ఆఫ్ సేల్స్ (పీఓఎస్) విక్రయదారులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేయాలి. కేసుల దర్యాప్తు సమయంలో సబ్‌స్క్రైబర్ యాక్టివేషన్ వివరాలు అందించాలని పీఓఎస్, టెలికాం ఆపరేటర్లను ఆదేశించాలి.
- డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లతో సహా సైబర్ క్రైమ్ నేరాలకు ఉపయోగించే మోసపూరిత సిమ్ కార్డులను వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలి.
- వాట్సప్ వంటి యాప్‌లు సిమ్ బైండింగ్ మెకానిజంను కఠినంగా అమలుచేయాలి. ఎక్కువసేపు సాగే మోసపూరిత కాల్స్‌ను గుర్తించేలా ఈ యాప్‌లో అధునాతన ఫీచర్లను తీసుకురావాలి.
- మోసాలకు ఉపయోగించిన డిజిటల్ డివైజ్‌ల ఐడీలను గుర్తించి వెంటనే బ్లాక్ చేయాలి. అప్పుడే ఆ డివైజ్ నుంచి వేరే ఖాతాతో నిందితులు మోసాలకు పాల్పడే అవకాశాన్ని నిరోధించొచ్చు.
- సైబర్ నేరాలకు ఉపయోగించే అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు డెబిట్ కాకుండా తాత్కాలికంగా వాటిని నిలిపివేయాలి. ఇందుకోసం ఆర్‌బీఐ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించేలా ఆదేశాలివ్వాలి.



## ఇరాన్ ఎయిర్‌లైన్స్‌తో లావాదేవీలు జరిపితే .. ఆంక్షలు తప్పవు



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ విమానయాన సంస్థలతో ఎలాంటి లావాదేవీలు జరపవద్దని విదేశీ కంపెనీలకు యూఎస్ ట్రెజరీ సూచించింది. అలాకాక ఎవరైనా లావాదేవీలు జరిపితే.. వారు కూడా ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఎక్స్‌లో ఈ మేరకు పోస్టు పెట్టారు. ఇప్పటికే ఆంక్షలు ఎదుర్కొంటున్న ఇరాన్ విమానయాన సంస్థలతో లావాదేవీలు జరిపితే.. ఆయా సంస్థలు ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెసెంట్ హెచ్చరించారు. విదేశీ ప్రభుత్వాల పరిధిలో ఉన్న కంపెనీలు ఇరాన్ విమానాలకు జెట్ ఇంధనం, క్యాటరింగ్, ల్యాండింగ్ ఫీజులు, నిర్వహణ వంటి సేవలను అందించకుండా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎకనామిక్ ఫ్యూరీ కింద ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకు ఎలాంటి చర్యలకైనా యూఎస్ ట్రెజరీ వెనకాడదన్నారు. ఇప్పటికే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇది టెహ్రాన్ ఆర్థిక పరిస్థితిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు అమెరికా- ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ.. తాజా హెచ్చరికలు రావడం గమనార్హం.


# తమిళనాడులో అడ్వకేట్‌గా.. రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషి

విశ్వంభర, నేషనల్ బ్యూరో:
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషిగా శిక్ష అనుభవించిన ఎ.జి.పేరరివాళన్.. తాజాగా అడ్వకేట్‌గా మారారు. తమిళనాడు-పుదుచ్చేరి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ఇటీవల తన పేరు నమోదు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ హత్య కేసులో 31 ఏళ్లపాటు జైలు జీవితం గడిపిన పేరరివాళన్ 2022లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విడుదలయ్యారు. ఆ తర్వాత బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. అక్కడ డిగ్రీ పూర్తి చేసి.. 2025లో ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ రాసి ఉత్తీర్ణులయ్యారు. త్వరలో ఆయన మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయనున్నారు. ఈ సందర్భంగా పేరరివాళన్ మీడియాతో మాట్లాడుతూ.. సరైన న్యాయ సహాయం అందక జైళ్లల్లో మగ్గిపోతున్న వేలాది మంది ఖైదీల గొంతుకగా మారడమే తన లక్ష్యమన్నారు. న్యాయం అందని నిరుపేద జీవిత ఖైదీల కోసం తాను పనిచేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీ పెరంబదూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజీవ్ గాంధీపై ఓ మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఆ బాంబు తయారీకి అవసరమైన రెండు బ్యాటరీలను (తొమ్మిది వోల్టులు) 19 ఏళ్ల పెరారివాళన్ కొనుగోలు చేసి ఇచ్చారనే అభియో గాలపై అరెస్టయ్యారు. ఈ కేసులో ఆయనకు 1998లో తొలుత ఉగ్రవాద వ్యతిరేక కోర్టు మరణశిక్ష విధించగా.. 2014లో సుప్రీంకోర్టు దాన్ని జీవిత ఖైదుగా మార్చింది. ఆ తర్వాత ఆ రాష్ట్ర గవర్నర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో.. ఆయన్ను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.



# అమెరికా దిగ్బంధనం ఎఫెక్ట్

## ఇరాన్ ఓడరేవుల్లో నౌకలు క్యూ



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
హర్మూజ్ జలసంధిపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుండడంతో ఇరాన్ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. దీనివల్ల పర్షియన్ గల్ఫ్‌కు వెలుపల, ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు వద్ద చమురుతో నిండిన ట్యాంకర్లు భారీగా నిలిచిపోయాయి. గత వారం రోజులుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని ఈ ఓడరేవు సమీప జలాల్లో సుమారు ఆరు నుంచి ఎనిమిది సూపర్‌ట్యాంకర్లు నిలిచిపోయినట్లు అంతర్జాతీయ సముద్ర నిఘా సంస్థ వెల్లడించింది. వివిధ దేశాలకు చెందిన పలు చిన్న ట్యాంకర్లు కూడా అక్కడే నిలిచిఉన్నట్లు తెలిపింది. కాగా ఈ దిగ్బంధనం కారణంగా ఇప్పటికే రెండు భారీ నౌకలను వెనక్కి పంపినట్లు అమెరికా నౌకాదళాలు వెల్లడించాయి. చాబహార్ వద్ద భారీగా ట్యాంకర్లు నిలిచిఉండడంతో.. ఇరాన్ నౌకల్లోకి చమురు ను వాటిలోకి మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పాత నౌకలను తిరిగి సేవలోకి తీసుకువస్తున్నట్లు షిప్-ట్రాకింగ్ డేటా వెల్లడించింది. అయితే ముడి చమురును నింపుకోవడానికి ఇంకా ఎన్ని ఖాళీ ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయనే దానిపై స్పష్టత లేదు. 2 మిలియన్ బ్యారెళ్ల వరకు ముడి చమురును నిల్వ చేయగల సామర్థ్యం ఉన్న 30ఏళ్ల నాటి ఒక వీఎల్‌సీసీకు చెందిన 'నాషా' నౌక గత వారం పర్షియన్ గల్ఫ్ నుంచి సంకేతాలు పంపడం ప్రారంభించిందని షిప్-ట్రాకింగ్ డేటా వెల్లడించింది. ప్రస్తుతం అది ఖర్గ్ ద్వీపం వైపు వెళ్తోంది. మూడేళ్ల క్రితం ఆ నౌక చివరిసారిగా సరకును పంపిణీ చేసింది. అమెరికా దిగ్బంధనం వల్ల ఇప్పటికే హర్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో సుమారు 155 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు నిల్వలు సముద్రంలో ఉన్నాయి. ప్రస్తుతం వీటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చమురును నిల్వ చేసే సామర్థ్యం అయిపోతున్నందున టెహ్రాన్ త్వరలోనే ఉత్పత్తిని నిలిపివేసే అవకాశం ఉంది. మరోవైపు హిందూ మహాసముద్రంలో ట్యాంకర్లను తనిఖీ చేయడం, ఇరాన్ చమురు కొనుగోలుదారుగా పేర్కొంటూ చైనాకు చెందిన రిఫైనరీపై ఆంక్షలు విధించడం వంటి చర్యలతో అగ్రరాజ్యం టెహ్రాన్‌పై ఒత్తిడి పెంచుతోంది.

# షట్‌డౌన్ దిశగా దేశీయ విమానయాన సంస్థలు

## కేంద్రానికి డెడ్ లైన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో:
దేశీయ విమానయాన రంగం మరోసారి సంక్షోభం దిశగా వెళ్తోంది. విమాన ఇంధన ధరలు విపరీతంగా పెరగడంపై విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇంధన ధరల నుంచి ఉపశమనం కల్పించకపోతే, కార్యకలాపాలు సాగించలేక సంస్థలను మూసివేయాల్సి వస్తుందని విమానయాన సంస్థల సమాఖ్య కేంద్రాన్ని హెచ్చరించింది. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులో సుమారు 40 శాతం కేవలం ఇంధనం కోసమే ఖర్చవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల వల్ల దేశీయంగా ఏటీఎఫ్ ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు లేఖ రాస్తూ.. అంతర్జాతీయ సర్వీసులకు వర్తించే విధంగానే దేశీయ సర్వీసులకు కూడా ఇంధన ధరల విషయంలో రాయితీలు లేదా ఏకరూపత ఉండాలని కోరింది. ధరలు తగ్గకపోతే ఖర్చు భరించలేక మరిన్ని విమానాలను గ్రౌండ్ చేయాల్సి వస్తుందని, ఇది అంతిమంగా విమాన ప్రయాణ ధరలు పెరగడానికి దారితీస్తుందని సంస్థలు పేర్కొన్నాయి. ఏటీఎఫ్‌పై ఉన్న వ్యాట్ , ఇతర ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలని విమానయాన సంస్థలు కోరుతున్నాయి. గతంలో ఉన్నట్లుగా 'క్రాక్ బ్యాండ్' మెకానిజం ద్వారా దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు ఒకే రకమైన ధరల విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఒకవేళ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోతే, విమానయాన సంస్థలు ఆ భారాన్ని ప్రయాణికులపైనే వేయక తప్పదు. ఇప్పటికే వేసవి రద్దీ, పండుగ సీజన్ల దృష్ట్యా విమాన టికెట్ల ధరలు మండిపోతుండగా, ఈ తాజా పరిణామాలు సామాన్య ప్రయాణికుడికి విమాన ప్రయాణాన్ని భారంగా మార్చే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా గో ఫస్ట్ (+శీ ఖీఅతీర్) వంటి సంస్థలు మూతపడటం, స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఈ రంగం భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఈ హెచ్చరికలపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు

## రాజ్‌నాథ్ సింగ్



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
ఉగ్రవాదంపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా గతేడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిగురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందన్నారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈసందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా.. ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్ర దాడులను అస్సలు విస్మరించకూడదని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీఓ వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రస్తుతం కొనసాగుతోన్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందన్నారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈక్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.